క్లుప్తంగా

పుస్తకపఠనంతోనే విజ్ఞానం పెంపొందుతుంది



రీడింగ్ రూమ్‌ను ప్రారంభిస్తున్న రాజేందర్

కుంటాల: పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెంపొందుతుందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్ పేర్కొన్నారు. కుంటాలలో రూ.2.50 లక్షల వ్యయంతో నిర్మించిన రీడింగ్ రూమ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత, నిరుద్యోగుల కోసం జిల్లాలోని గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. కుంటాల గ్రంథాలయంలో చదివి ఉద్యోగం సాధించిన పోలీస్ కానిస్టేబుల్ గీత్ కుమార్‌ను సన్మానించారు. సర్పంచ్ సమత, ఎంపీపీ గజ్జారాం యాదవ్, వైస్ ఎంపీపీ మానిక నవీన్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, గ్రంథాలయాధికారి మెంగ రాజు, పంచాయతీ కార్యదర్శి రాజబాపు పాల్గొన్నారు.

కుస్లీలో 'గృహలక్ష్మి' గొడవ



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

సర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ గ్రామ పంచాయతీ వద్ద శనివారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఎంపీపీ కార్యాలయ ఆవరణలో కుస్లీ గ్రామానికి చెందిన 22 మందికి ఎంపీపీ శుక్రవారం గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందించారు. అయితే అనర్హులను గృహలక్ష్మి పథకానికి ఎంపిక చేశారని ఆరోపిస్తూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గ్రామంలో ఇళ్లు లేని పేదలు ఉన్నా.. అనర్హులకు మంజూరు పత్రాలు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అర్హులకు గృహలక్ష్మి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

బీడీ కంపెనీల దోపిడీని అరికట్టాలి

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి బీడీ కంపెనీ యాజమాన్యంతోపాటు టేకేదారుల దోపిడీని అరికట్టాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పీటర్, సహాయ కార్యదర్శి సురేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బీడీ కార్మికులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాత్రనకా, పగలనకా శ్రమ కోర్చి పనిచేస్తున్న బీడీ కార్మికులను టేకేదారులు చేస్తున్న దోపిడీని అరికట్టాలన్నారు. బీడీ కట్టలలో, తంబాకులో కోతలు విధించడంతోపాటు ఒక్కో కార్డుదారు నుంచి రూ.30కి పైగా కమీషన్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నాణ్యమైన ఆకు, తంబాకు ను ఇవ్వడం లేదన్నారు. పీఎఫ్ కోసం వచ్చే వారికి పెన్షన్ ఇప్పిస్తామంటూ రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక శాఖ అధికారులు యాజమాన్యాలతో కుమ్మక్కు కావడంతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి స్వరూప, నాయకులు గణేశ్, హైమద్ పాల్గొన్నారు.

సన్మానం

మామడ: పొన్కల్ మండలంగా ఇటీవల ప్రకటించడంతో జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అందరి పోరాటంతోనే మండల ఏర్పాటు సాధ్యమైందని, ఇందులోభాగంగా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలను శనివారం సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ హరీశ్‌కుమార్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గంగారెడ్డి, సర్పంచులు భూమేశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఎంపీటీసీలు కోంద్ర భాగ్యలక్ష్మి రాజారెడ్డి, ముత్యం, పడాల శ్రీనివాస్, బొజ్జ రాద గంగాధర్, ఉప సర్పంచ్ నరేశ్‌రెడ్డి, జేఏసీ నాయకులు సుధాకర్‌రెడ్డి, ముత్యంరెడ్డి ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

భైంసా: బాసర మండలంలో ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఆదివారం పర్యటించనున్నట్లు సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. రూ.7 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. బాసర గ్రామ పంచాయతీ పరిధిలో పోచమ్మగల్లీ నుంచి పాపేశ్వర ఆలయం బైపాస్ రోడ్డు వరకు రూ.4.70 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం, బాసరలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేస్తారని తెలిపారు. కిర్గుల్(కె)లో రూ.22 లక్షలతో నూతనంగా నిర్మించే రామాలయానికి ఎమ్మెల్యే భూమిపూజ చేస్తారని పేర్కొన్నారు.

తానూరు: మండలంలోని నంద్‌గాం, సింగన్‌గాం, జౌలా(బి) గ్రామాల్లో ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఆదివారం పర్యటిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతారెడ్డి తెలిపారు. నంద్‌గాం జీపీ భవనం పనులకు భూమి పూజ, అదేగ్రామంలో 10 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులు, జౌలా(బి)లో హెల్త్ సబ్‌సెంటర్ పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

వంతెన నిర్మాణం కలేనా?

- ఖానాపూర్, పెంబి మండలాల్లో దుస్థితి
- వర్షాలకు వాగులు పొంగితే రాకపోకలు బంద్
- ఇబ్బందుల్లో గిరిజనులు
- పట్టించుకోని అధికారులు

ఖానాపూర్: నియోజకవర్గంలోని ఖానాపూర్, పెంబి మండలాల్లోని గిరిజన గ్రామాల్లో ఏళ్లుగా రవాణాసౌకర్యం మెరుగుపడడం లేదు. దశాబ్ద కాలంగా వంతెనల నిర్మాణం కలగానే మిగిలిపోయింది. వర్షాలు కురిస్తే వాగులు, వంకలు పొంగితే రాకపోకలు బంద్ అవుతాయి. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులకు పురిటినొప్పులు వస్తే ఆస్పత్రికి తరలించాలన్నా 108 అంబులెన్స్‌లు గ్రామాలకు రాని పరిస్థితి. రోడ్లపైనే ప్రసవాలు జరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

సమస్యలు..అనేకం

ఖానాపూర్ మండలం ఎర్వచింతల్, పెంబి మండలం పస్పుల, యాపల్‌గూడ, గుమ్మెన, వెంకపోచంపాడ్ పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో ఏళ్లుగా సమస్యలు అనేకం ఉన్నాయి. పెంబి మండలంలోని యాపల్‌గూడ, రామ్‌నగర్, సత్తుగూడ, వస్‌పల్లి, దోందరి, పస్పుల, అర్చనతండా, తులసిపేట్, గుమ్మెన ఎంగ్లాపూర్ తదితర గ్రామాలున్నాయి. ఆయా గ్రామాలకు పెంబి నుంచి 3 కి.మీ దూరం వెళ్లే మధ్యన కడెం, దొత్తి వాగులు దాటాల్సి ఉంటుంది. కడెం వాగు వరకు ప్రైవేటు వాహనాల్లో వెళ్లి, అక్కడి నుంచి కాలినడకన వాగులు దాటాల్సిన పరిస్థితి. వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తే వారి బాధలు అన్నీఇన్నీకావు. అంకెన, రాయదారి, పోచంపల్లి, గోదుమాల పైన, గోదుమాల కింద, కర్ణంలొద్ది తదితర గ్రామాల వారు సైతం పెంబికి వెళ్లాలంటే కడెం వాగుదాటి రావల్సి ఉంటుంది. లేదా ఖానాపూర్ మీదుగా పెంబి వెళ్లాలంటే సుమారు 80 కి.మీటర్లకు పైగా దూరాన వాహనాల్లో వెళ్లాల్సి ఉంటుంది. ఖానాపూర్ మండలం కొలాంగూడ పంచాయతీ పరిధిలోని కుసుంపూర్‌కు వెళ్లాలన్న బల్లివాగు దాటాలి. ఆయా గ్రామాలకు రహదారులు లేక 108 కూడా వెళ్లలేని పరిస్థితి గ్రామాల్లో ఉంది. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్నా, రేషన్ సరుకులు, పింఛన్లు పొందేవారు సైతం ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.



పెంబి మండలం యాపల్‌గూడకు కడెం వాగు నుంచి దాటి వెళ్తున్న గిరిజనులు



కొట్టుకుపోయిన పస్పుల వంతెన (ఫైల్)

కొట్టుకుపోయిన వంతెన

పెంబి మండలం పస్పుల, అర్చనతండా, తులసిపేట్, దయ్యాలమద్ది తదితర గ్రామాలకు వెళ్లాలంటే కడెం వాగు దాటాల్సి ఉంది. గతేడాది భారీ వరదలకు వంతెన కొట్టుకుపోయింది. అయినా నేటికి వంతెన పనులు, తాత్కాలిక రోడ్డు పనులు చేపట్టలేదు. గ్రామాలకు రహదారులతోపాటు ఆయా గ్రామాలకు గత దశాబ్దాల కాలంగా విద్యుత్‌సౌకర్యం సక్రమంగా లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

కొన్ని ఘటనలు..

- పెంబి మండలం యాపల్‌గూడ నుంచి 2013లో పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణులను వాగులో నుంచి ఎడ్లబండిలో తీసుకుని పరిస్థితి. 108 అంబులెన్స్ సైతం రాని పరిస్థితి ఉండడంతో అప్పటి వైద్యుడు కట్కం రాము అక్కడికే వెళ్లి ప్రసవం చేశాడు.
- యాపల్‌గూడ పరిధిలోని పలువురు వాగు దాటుతూ వాగుల్లో గల్లంతైన ఘటనలు చోటుచేసుకున్నాయి.

నిధులు లేకనే..



గత తొమ్మిదేళ్లలో ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పెంబి మండలం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గ్రామీణ ప్రాంతాలకు వంతెనలతోపాటు రోడ్ల సమస్య తీవ్రంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలి.

– జానుబాయి, జెడ్పీటీసీ, పెంబి

- గత ఆరేళ్ల ఏళ్ల క్రితం శెట్‌పల్లి వాగు ఒడ్డున ఓ రైతు ట్రాక్టర్ ఉంచాడు. రాత్రి భారీ వర్షంతో ట్రాక్టర్ వాగులో కొట్టుకుపోయింది.
- గత ఐదేళ్ల క్రితం వర్షాకాలంలో ఖానాపూర్ మండలం ఎర్వచింతల్‌లో గ్రామసభకు వచ్చి తిరిగి వెళ్తుండగా వాగు పొంగడంతో గిరిజన యువకుడు గల్లంతై మృతి చెందాడు.
- 2014 సర్పంచ్ ఎన్నికల సమయంలో పెంబి మండలం గుమ్మెన, ఎంగ్లాపూర్ గ్రామాలకు వెళ్లే దారిలో దొత్తివాగు, ఒర్రెలు పొంగడంతో అధికారులు పది రోజుల వరకు ఎన్నికలు వాయిదా వేశారు.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో దోందరి పంచాయతీ పరిధిలోని వస్‌పల్లికి చెందిన గర్భిణులు సీడాం సరిత, గత నెల 24న పెంబి మండలం తులసిపేట్ గ్రామానికి చెందిన గంగమణి రోడ్డుపై ప్రసవించారు.

మెనూ ప్రకారం అల్పాహారం అందిస్తాం

సోన్: సీఎం అల్పాహార పథకంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం రెండోరోజూ వెజ్ పులావ్‌ను అందించారు. సీడీపీవో నాగమణి మాట్లాడుతూ విద్యార్థులు పులావ్‌ను చాలా ఇష్టంగా తిన్నారని అన్నారు. వారంలో ప్రతిరోజు మెనూ ప్రకారం అల్పాహారం అందిస్తామన్నారు. సోన్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆరాధన, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శాంతకుమార్, సురేందర్, బాబు, కృష్ణ వేణి, సురేష్, పద్మలత, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: ప్రోగ్రాం నోడల్ అధికారి జాదవ్ అంబాజీ నాయక్ ఆదేశాల మేరకు సుర్జాపూర్ ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో సీఎం అల్పాహార పథకం నిర్వహణను పర్యవేక్షణ అధికారి నగేష్‌బాబు శనివారం పరిశీలించారు. హెచ్‌ఎం దాసరి శంకర్, సిబ్బంది ఉన్నారు.



సోన్: అల్పాహారం చేస్తున్న విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: ఆశవర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట 12వ రోజు నిరవధిక రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులతోపాటు ఆశవర్కర్లకు మద్దతుగా శనివారం ఎమ్మెల్యే దీక్షాశిబిరంలో కూర్చున్నారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ పరిమళ్ భౌమిక్, ఆర్ఐ రాజేశ్వర్ ఉన్నారు. అదేవిధంగా పందుల పెంపకం కోసం ఐదెకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని పద్మావతినగర్ కాలనీలో నివాసం ఉండే ఎరుకల కులస్తులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు.



దీక్షాశిబిరంలో కూర్చున్న ఎమ్మెల్యే రేఖానాయక్

చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

కుంటాల: కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎంపీపీ అరుణ రమణారావు అన్నారు. ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఎంపికైన గ్రామాలకు చెందిన గీత్‌కుమార్, లక్ష్మణ్, సంధ్యారాణి, ప్రఫుల్, సోని, నిశిత, గజ్జారాం, మధుకర్, సంధ్య, గజానంద్‌ను వీరిని శనివారం కుంటాలలో సన్మానించారు. రిటైర్డ్ టీచర్లు గజ్జారాం, సోమశంకర్, రాంనాథ్, లింగారావు, రాజ్‌కుమార్, రమేశ్, గజేందర్, రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని కావేరి గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమై ప్రభుత్వ కొలువులు సాధించిన 15 మంది అభ్యర్థులను కావేరి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అప్పాల చక్రధారి శనివారం సన్మానించారు. ఉద్యోగాలు పొందిన రాకేశ్, సాయి, ప్రకాశ్, శివ, ఉదయ్, సునీల్, కిరణ్, ఉదయ్, రమణ, గోపి, సమీరుద్దీన్, ఇమ్రాన్ నవీన్, రాజు, రాహుల్, రెహమాన్‌ను అభినందించారు. సభ్యులు దీపక్‌రెడ్డి, రాజమణి ఉన్నారు.



అభ్యర్థులను సన్మానిస్తున్న రమణారావు

ఖానాపూర్: పట్టణంలోని రక్ష డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొంది పోలీసుశాఖలో కానిస్టేబుళ్లుగా ఉద్యోగాలు సాధించిన 18 మందిని మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, హిందూ ఉత్సవసమితి నాయకులు శనివారం సన్మానించారు. నిర్వాహకుడు పాదం రాకేశ్ ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

సర్సాపూర్(జి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీపీ కార్యాలయ ఆవరణలో శనివారం 8 గ్రామాలకు చెందిన 157 మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కేసీఆర్ హయాంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అర్లి(కె)10, బూరుగుపల్లి(జి)16, బామిని(బి)17, చాక్‌పల్లి 33, గొల్లమాడ 40, నందన్ 12, తిమ్మాపూర్(జి)18, తురాటిలో 11 లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గొల్లమాడ ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.2 లక్షల 50 వేలు, ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.2 లక్షల ప్రొసీడింగ్ కాపీలను కుల సంఘాల సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోంద్ర రేఖ, జెడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీటీసీ మల్లేశ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ పాపెన్ రాజేశ్వర్, కోఆప్షన్ మెంబర్ ఫసీ, సర్పంచులు రాంరెడ్డి, చెన్న మహేష్, వడ్నం అశ్విని, ఎంపీడీవో వనజ, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శులు శివకుమార్, నరేశ్‌కుమార్, సాయికిరణ్, రాజు, గంగాజల పాల్గొన్నారు.



గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ

ముధోల్: మండలంలోని గన్నోర గ్రామస్తులకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శనివారం ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు. జీవో నెంబర్ 58 ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసి స్థలాల పట్టాలు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్‌ఖాన్, జెడ్పీటీసీ సురేందర్‌రెడ్డి, సర్పంచ్ లావణ్య కిష్టయ్య, కోఆప్షన్ సభ్యుడు మగ్దుమ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, గంగారెడ్డి, పెద్దమాళ్ళు, చిన్నమాళ్లు, కత్తి లక్ష్మణ్, మాదిరి రాములు, అనిత, ప్రభాకర్, దేవన్న, పోతన్న పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' మంజూరు పత్రాలు అందజేత

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లిలో 18 మంది లబ్ధిదారులకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొరిపెల్లి క్రిష్ణారెడ్డి శనివారం గృహలక్ష్మి మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ లింగన్న, నాయకులు రవి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



ధర్మోరలో చీరలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి



పార్డి(బి) గ్రామంలో చీరలు అందజేస్తున్న నాయకులు

కుభీర్: మండలంలోని పార్డి(బి) గ్రామంలో ఎంపీపీ తూము లక్ష్మీబాయి శనివారం మహిళలకు బతకమ్మ చీరలు పంపిణీ చేశారు. సర్పంచ్ పుష్ప, నాయకులు సురేష్, బాబు, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: ధర్మోర పంచాయతీ కార్యాలయంలో వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి శనివారం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. సర్పంచ్ మంద శారద, నాయకులు ఖైరోద్దీన్, సాయేందర్, మంద భాస్కర్, మంద నర్సయ్య, ఐకేపీ సీఏ అకుల నాగమణి, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

ఖానాపూర్: ఎర్వచింతల్, తర్లపాడ్ గ్రామాల్లో నివారం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. గోపాల్, వాల్‌సింగ్, నర్సయ్య, మల్లేష్, మహేశ్, తదితరులు ఉన్నారు.

అక్రమాలపై విచారణ జరపాలి



రిలే నిరాహారదీక్ష చేస్తున్న రాజు

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బురుగుల రాజు రిలే నిరాహారదీక్షకు దిగారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు జనసేన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు సుంకెట మహేశ్ మద్దతు ప్రకటించారు.

బస్సు సర్వీసులు పెంచాలి

ఖానాపూర్: ఖానాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సు సర్వీసులు పెంచాలని అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల అశోక్, లంబాడా హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో శనివారం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కాగా,ఖానాపూర్ నుంచి మద్దిపడగ, బెల్లాల్ గ్రామాలకు వెళ్లేదారిలో బస్సులు పునరుద్ధరించాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన రాంప్రసాద్, రేఖలకు సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం మంజూరైంది. రాంప్రసాద్‌కు రూ.లక్ష, రేఖకు రూ.25 వేలు మంజూరైన చెక్కులను పీఏసీఎస్ చెర్మన్ రత్నాకర్‌రావు శనివారం అందజేశారు. సర్పంచ్ వెంకట్‌రావు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా

క్రీడా దుస్తుల పంపిణీ

లక్ష్మణచాంద: పీచర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 24 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత సురేందర్‌రెడ్డి శనివారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. హెచ్‌ఎం సాయిక్రిష్ణ, వీడీసీ సభ్యుడు భూమేష్ ఉన్నారు.

తానూరు: భోసి పంచాయతీ కార్యాలయంలో ప్రభుత్వం అందించిన క్రీడా సామాగ్రిని సర్పంచ్ ఆనంద్ శనివారం యువకులకు అందించారు. గ్రామ కమిటీ సభ్యులు ఉన్నారు.

టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి భూమిపూజ

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్ భూమిపూజ చేశారు. ప్రిన్సిపాల్ గంగాధర్, కౌన్సిలర్ శ్రీకాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూమి పూజ

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ ఆలయ ప్రహరీ, గాలిగోపురం నిర్మాణ పనులను ఆలయ కమిటీ సభ్యులు శనివారం ప్రారంభించారు. రూ.28 లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ సమతా వెంకటేష్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, ఎండోన్మెంట్ ఏఈ దామోదర్ రెడ్డి, పాల్గొన్నారు.

ఆశల సమ్మెకు బీఆర్ఎస్ సంఘీభావం

కుంటాల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశకార్యకర్తలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. కుంటాలలో శనివారం వారికి బీఆర్ఎస్ నేతలు సంఘీభావం తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ దత్తాద్రి, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, సర్పంచ్ ఎండీ హైమద్, ఆత్మ మాజీ చైర్మన్ సవ్వి అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ మధుకర్, వెంకటేశ్, లక్ష్మణ్, రాకేశ్, పవార్ రాజు పాల్గొన్నారు.

ముధోల్: ముధోల్‌లో ఆశవర్కర్లు చేపట్టిన సమ్మెకు ఎంపీటీసీ దేవోజీ భూమేష్ మద్దతు తెలిపారు.

నిధులు మంజూరు

కుంటాల: అంబకంటిలోని మున్నూరు సంఘ భవనం కోసం సీడీపీ నిధులు 2.5 లక్షలు, జెడ్పీ నిధులు రూ.2 లక్షలు, శివాలయం అభివృద్ధి కోసం రూ.2.5 లక్షల నిధులు మంజూరయ్యాయని సర్పంచ్ ముజిగే ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులతో పుస్తక పఠనం చేయించాలి

కడెం: విద్యార్థులతో ప్రతీరోజు పుస్తక పఠనం చేయించాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను శనివారం పర్యవేక్షించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, పాఠశాల నిర్వహణను పరిశీలించారు. హెచ్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయుడు రాజేశ్‌నాయక్, సీఆర్పీ రాజేశ్వర్ ఉన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

ముధోల్: తరోడాలో శనివారం ఎస్‌డీఎఫ్ నిధులు రూ.3లక్షలతో సీసీ రోడ్ల పనులను సర్పంచ్ శేత్య రవికిరణ్‌గౌడ్ ప్రారంభించారు. ఎంపీటీసీ గంగాధర్, ఉప సర్పంచ్ యూహియ్య ఖాన్ ఉన్నారు.

సన్మానం

భైంసాటౌన్: పట్టణంలోని గురుకృపా వొకేషనల్ కళాశాల విద్యార్థినులు ఎస్.శ్రీలక్ష్మి రిమ్స్, ఆదిలాబాద్‌లో, స్రవంతి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, బాన్సువాడలో బీఎస్సీ నర్సింగ్‌లో సీటు సాధించారు. శనివారం కళాశాలలో వారిని సత్కరించారు. డా ముష్కం రామకృష్ణగౌడ్‌తోపాటు శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు ప్రసన్నరాణి, కళాశాల ప్రిన్సిపాల్ సాయినాథ్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కుంటాల: మండలంలోని మెదన్‌పూర్‌లో రైతు కల్యాణ్ లింగురామ్‌కు గేదె శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఉదయం గేదె మేతకు కోసం వెళ్లగా గ్రామ శివారులో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌కు తగలడంతో ఈ ప్రమాదం సంభవించింది.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఖానాపూర్: మున్సిపల్‌లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు టి. సుధాకర్ అన్నారు. పట్టణంలోని శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మికులకు ఫిక్స్‌డ్ వేతనం రూ.21వేలు ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్ ఉన్నారు.

డ్రెయినేజీలను శుభ్రం చేయాలి

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామాన్ని శనివారం డీఎల్‌పీవో శివకృష్ణ సందర్శించారు. గ్రామ వీధులను పరిశీలించారు. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సర్పంచ్ రాజన్న, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ప్రమాణ స్వీకారం

నిర్మల్‌టౌన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పోలిశెట్టి శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జొన్నల మహేష్, కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా నాగరాజు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా కేంద్రంలో సంఘంలో శనివారం వారు ప్రమాణస్వీకారం చేయగా, పలువురు అభినందించారు.

ఎస్సీ కమ్యూనిటీ కోసం నిధులు మంజూరు

లోకేశ్వరం: వట్టోలిలోని ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి మంజూరైన రూ.2లక్షల నిధుల ప్రోసెడింగ్ కాపీని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మాజీ జెడ్పీ చెర్మన్ లోలం శ్యాంసుందర్ శనివారం సభ్యులకు అందజేశారు. వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సర్పంచ్ ఎల్లన్న ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కుంటాల: పర్యావరణ పరిరక్షణకు మహిళలు కృషి చేయాలని సర్పంచ్ సమతా వెంకటేశ్ సూచించారు. కుంటాలలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు శనివారం తడిచెత్త–పొడిచెత్తపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, కార్యదర్శి రాజబాపు, ఏపీఎం అశోక్, స్త్రీ నిధి అసిస్టెంట్ మేనేజర్ స్వాతి పాల్గొన్నారు.

23న దసరా, 26న బతుకమ్మ

ఖానాపూర్: త్వరలో ప్రారంభం కానున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల అనంతరం ఈనెల 23న దసరా, 26న బతుకమ్మ పండుగను నిర్వహించాలని వేదపండితుడు చక్రపాణి వాసుదేవాచార్యులు, అర్చకుడు నర్సింహమూర్తి తెలిపారు. పట్టణంలోని గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘంతోపాటు హిందూ ఉత్సవసమితి, వీడీసీల పెద్దలు, మున్సిపల్ చైర్మన్ రాజేందర్ సమక్షంలో శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు.

రైతులకు అవగాహన

ముధోల్: స్థానిక రైతువేదికలో శనివారం మండల రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిర్మల్ సమీకృత సాగు ప్రాజెక్టు, విజయ డెయిరీల ఆధ్వర్యంలో రైతులకు పాల సేకరణ లోన్, పీఎం ఈజీపీలో రుణాల రాయితీల గురించి వివరించారు. సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, జీఎం ఇండస్ట్రీయల్ నర్సింహారెడ్డి, విజయడెయిరీ డీడీఎం మధుసూదన్‌రావు, ఎల్‌డీఎం బ్యాంక్స్, ఏడీ ఫిషరిస్ నర్సింహ, వీఏఎస్ రవీందర్, డీఏవో అంజిప్రసాద్, ఎంఈవో భాస్కర్ ఉన్నారు.

వీహెచ్‌పీ అధ్యక్షుడిగా రాజేశ్వర్

ఖానాపూర్: ఖానాపూర్ ప్రఖండ విశ్వహిందూ పరిషత్ ఖానాపూర్ అధ్యక్షుడిగా జోగు రాజేశ్వర్ నియామకమయ్యారు. ఈ మేరకు బజరంగ్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాములు, జిల్లా కార్యదర్శి జాదవ్ విఠల్ ఓ ప్రకటనలో తెలిపారు.

పరామర్శ

కుంటాల: మండలంలోని కల్లూర్ మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ ఎంపీపీ భోజరాం పటేల్, శంకర్పంద్రే, శ్యామ్‌రావు పటేల్ ఉన్నారు.

గొర్రెల పంపిణీ

కుభీర్: పల్సి గ్రామానికి చెందిన 12మంది గొల్లకుర్మలకు సబ్సిడీ గొర్రెలు పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి సర్వోత్తమ్ తెలిపారు. సర్పంచ్ కవిత, గొర్రెల సంఘం అధ్యక్షుడు నిమ్మ లక్ష్మణ్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడెం: చిట్యాల్‌కు చెందిన ఆలిశెట్టి భాగ్యవ్వ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, మానవ సేవే మాధవ సేవ ఫౌండేషన్ సభ్యులు శనివారం రూ.6210 ఆర్థికసాయం అందజేశారు. మహేశ్, కె.నవీన్, రంజిత్, పవన్, ఎ.నవీన్ ఉన్నారు.

'ఆశల' న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



మద్దతు తెలుపుతున్న రామారావుపటేల్

భైంసాటౌన్: ప్రజలకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ వైద్యసేవలందిస్తున్న ఆశ కార్యకర్తలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, వారి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావుపటేల్ అన్నారు. భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రి వద్ద ఆశ కార్యకర్తల నిరవధిక సమ్మెకు శనివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 13 రోజులుగా సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని, ప్రభుత్వానికి సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ పటేల్, తాలోడ్ శ్రీనివాస్, వడ్నపు శ్రీనివాస్, రవి, గంగాప్రసాద్, నాగేష్, ఆశకార్యకర్తలు ఉన్నారు.